

శిడిబండికి కట్టిన ఉట్టి బుట్టలో యువకుడి ఊరేగింపు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

శుక్రవారం 1 మార్చి 2024


శిడిబండి ఉత్సవంలో అశేష భక్తజనవాహిని

అంబరాన్నంటిన శిడి సంబరం

సిరులనిచ్చే వీరమ్మతల్లి శిడిబండి వేడుక వైభవంగా జరిగింది. తిరునాళ్లలో 11వ రోజైన గురువారం శిడిబండి వేడుకను వీక్షించేందుకు భక్తులు అశేషంగా ఉయ్యూరు తరలారు. కొబ్బరితోట సమీపం నుంచి డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ శిడిబండి బయల్దేరింది. మహిళలు హారతులతో స్వాగతం పలకగా, శివాలయం రోడ్డు, ప్రధాన సెంటర్ మీదుగా అమ్మవారి ఆలయానికి చేరుకుంది. ఆచారం ప్రకారం స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన ఓ కుటుంబంలో వివాహానికి సిద్ధంగా ఉన్న యువకుడికి పూజలు చేసి ఊరేగింపుగా శిడిబండికి కట్టిన ఉట్టి బుట్టలో కూర్చోబెట్టారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఆ తర్వాత పురవీధుల్లో ఊరేగింపు జరిగింది. ఈ ఉత్సవాన్ని చూసేందుకు మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో తరలిరాగా ఆలయ ప్రాంగణంతో పాటు ప్రధాన రహదారులు జనసంద్రమయ్యాయి. గన్నవరం డీఎస్పీ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. - ఉయ్యూరు

డెల్టా ఉల్టా!

- మూడేళ్లుగా రబీకి సాగునీరు ఇవ్వని ప్రభుత్వం
- కృష్ణానదిపై మినీ బ్యారేజీలకు నిధులు శూన్యం
- అటకెక్కిన... సాగునీటి కాలువల ఆధునీకరణ
- దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం శూన్యం
- నేడు పామర్రులో సీఎం జగన్ పర్యటన

'రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం.. వ్యవసాయాన్ని పండుగ చేస్తాం' అని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్లుగా కృష్ణాడెల్టాను ఉల్టా చేసేసింది. సాగునీటి ప్రధాన కాలువల ఆధునీకరణను జగన్ సర్కారు అటకెక్కించింది. గతేడాది డిసెంబరు నెలలో సంభవించిన మిచౌంగ్ తుఫాను వల్ల కోల్పోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించకుండా చేతులెత్తేసింది. మూడేళ్లుగా రబీలో సాగునీటి విడుదలను ఆపేసింది. ప్రకాశం బ్యారేజీకి దిగువన రెండు మినీ బ్యారేజీలు కట్టి వృథా జలాలను ఒడిసిపట్టుకుంటామని చెప్పిన మాటలన్నీ నీటి మూటలేనని నిరూపితమైంది. జిల్లాలో కరకట్టల అభివృద్ధిని ప్రభుత్వం మరిచిపోయింది. ఇలా జిల్లాకు ఇచ్చిన హామీలు, చేయాల్సిన అభివృద్ధి పనులు అనేకం పెండింగులోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యాదీవెన కార్యక్రమంలో పాల్గొనేందుకు నేడు పామర్రుకు వస్తున్న నేపథ్యంలోనైనా ఈ సమస్యలపై ఆయన స్పందిస్తారో లేదో చూడాలి. -మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి

నదీగర్భంలోని ఇసుక దోపిడీ



గత ఐదేళ్లుగా జిల్లాలోని రొయ్యూరు, శ్రీకాకుళం, పాపవినాశనం, మోపిదేవి, అవనిగడ్డ తదితర ప్రాంతాల్లోని ఇసుకరేవుల నుంచి ఇసుకను దోచేస్తూ అధికార పార్టీ నాయకులు కోట్లు వెనకేసుకున్నారు. కరోనా సమయంలో ప్రజలు, అధికారులు బయట తిరగకపోవడంతో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు వంతులవారీగా ఇసుక రేవులను పంచుకున్నారు. పెనమలూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్ తన మనుషులను, తనకు అనుకూలంగా ఉన్న అధికారులను అడ్డుపెట్టుకుని ఇటీవల ఇసుకను యథేచ్ఛగా తరలించేస్తున్నారు. ఇసుక తరలింపులో ప్రభుత్వ పెద్దలకు ఎప్పటికపుడు వాటాలు పంపుతూ కృష్ణానదిలోని ఇసుకను నేటికీ తరలిస్తూనే ఉన్నారు.

కృష్ణాడెల్టా ఆధునీకరణను పక్కన పెట్టేశారు



వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2021లో మాత్రమే రబీ సీజన్ (దాళ్వా)కు సాగునీరు విడుదల చేశారు. మూడేళ్లుగా రబీ సీజన్‌లో పంటల సాగుకోసం సాగునీటిని విడుదల చేయలేదు. కృష్ణాజిల్లాలోని ప్రధాన పంటకాలువలు, డ్రెయిన్‌ల ఆధునికీకరణకు గతంలో రూ.2,180 కోట్లతో ఉన్న ప్రతిపాదనలను తుంగలో తొక్కేశారు. నిధులలేమిని కారణంగా చూపి ఈ పనులను నిలిపివేశారు. రెండేళ్ల క్రితం జిల్లాలోని ప్రధాన పంటకాలువలు, డ్రెయిన్‌లలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్‌ఎం) పనులకు రూ.57 కోట్లు కేటాయించారు. అయినా పనులు సక్రమంగా చేయలేదు. గతేడాది ఓఅండ్‌ఎం నిధుల కేటాయింపులో పొదుపు పాటించి రూ.27 కోట్లకు కుదించారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో ఓఅండ్‌ఎం పనులు సక్రమంగా చేయకపోవడంతో డ్రెయిన్‌లు పూడుకుపోయాయి. డిసెంబరులో సంభవించిన తుపాను కారణంగా కురిసిన భారీవర్షాలకు పంట చేతికొచ్చే దశలో పొలాల్లో వర్షపునీరు రోజుల తరబడి నిలబడిపోయింది. జిల్లాలో 83,462 హెక్టార్లలో వరి దెబ్బతిన్నా పంట నష్టపరిహారం 57,777 హెక్టార్లకు మాత్రమే ఇచ్చేలా తుది జాబితాలను తయారు చేశారు. తొలుత తయారు చేసిన పంట నష్టపరిహారం రూ.141.56 కోట్లు వస్తుందని ఆశ చూపారు. ఏవేవో లెక్కలు సరిచేసి ఈ నగదు మొత్తాన్ని రూ.99 కోట్లకు కుదించారు. సంక్రాంతి పండుగ నాటికి పంట నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పినా ఇంతవరకు విడుదల చేసిన దాఖలాలు లేవు. పంట నష్టపరిహారం సంగతి అలా ఉంచితే, పంటబీమా విడుదలపై అధికారులు, పాలకులు పెదవి విప్పడం లేదు.

రెండు మినీ బ్యారేజీలు ఏమయ్యాయి?



కృష్ణాజిల్లాకు సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు, వరదనీరు సముద్రంలో కలవకుండా ఒడిసిపట్టి నిల్వ ఉంచేందుకు ప్రకాశం బ్యారేజీ దిగువన రెండు నూతన బ్యారేజీలు నిర్మాణం చేసేందుకు 2020 జనవరిలో ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం బ్యారేజీకి దిగువన 16 కిలోమీటర్ల దూరంలో చోడవరం వద్ద బ్యారేజీ నిర్మాణం చేసేందుకు రూ.2223.42 కోట్లతో, ప్రకాశం బ్యారేజీకి దిగువన 67 కిలోమీటర్ల దూరంలో మోపిదేవి వద్ద మరో బ్యారేజీ నిర్మాణానికి రూ.2526.39 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఈ బ్యారేజీల నిర్మాణం ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ బ్యారేజీల నిర్మాణానికి నిధులే కేటాయించకుండా మొండిచేయి చూపారు. అవనిగడ్డ నియోజకవర్గంలోని కోడూరు, నాగాయలంక మండలాల్లోని పంటపొలాల్లోకి సముద్రపునీరు చొచ్చుకురాకుండా ఉండేలా ఏడు అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల మరమ్మతులకు రూ.3,344.50 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఈ ప్రతిపాదనలు నేటికీ కాగితాలను దాటలేదు. దివిసీమ ప్రాంతానికి సాగునీటిని అందిస్తూ జీవనాడిగా ఉన్న పులిగడ్డ అక్విడెక్టుకు కూడా ప్రభుత్వం కనీస మరమ్మతులు చేయలేదు. అయినా బిల్లులు చేసుకున్నారు.

కృష్ణా కరకట్ట అభివృద్ధి మరిచారు!

విజయవాడ సమీపంలోని యనమలకుదురు నుంచి మోపిదేవి వార్పు వరకు కృష్ణానదీతీరం వెంబడి కృష్ణా కరకట్ట ఉంది. కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడు వరదనీరు గ్రామాలను, పంట పొలాలను ముంచెత్తకుండా ఈ కరకట్టను రూపకల్పన చేశారు. ఈ కరకట్ట ప్రస్తుతం పూర్తిగా దెబ్బతింది. రూ.25 కోట్లతో కరకట్టను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చినా ఒక్క రూపాయి పని కూడా ఈ ఐదేళ్లలో చేయలేదు. నదిలో తవ్విన ఇసుకను ఇతరప్రాంతాలకు తరలించేందుకు మాత్రం కరకట్టను పాలకులు ఉపయోగించుకున్నారు.

ధాన్యం బిల్లులు ఇస్తారా?



కృష్ణాజిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఆఫ్‌లైన్‌లో 45 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ ధాన్యం బకాయిలు నెలల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయి. రైతులు ధాన్యం బిల్లులు మంజూరు చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఆన్‌లైన్ విక్రయించిన ధాన్యానికి బిల్లులను ఈ ఏడాది జనవరి 18వ తేదీ నుంచి విడుదల చేయడం లేదు. జిల్లాకు చెందిన రైతులకు రూ.280 కోట్ల బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. జిల్లాలో ఇంకా రెండు లక్షల టన్నుల ధాన్యం కుప్పలపై ఉంది. ఈ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందో లేదో తెలియని స్థితి నెలకొంది. ఇన్ని సమస్యలు జిల్లాను వెంటాడుతుండగా ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వస్తున్నారు. జిలాలో నెలకొన్న సమస్యలపై స్పందించడంతోపాటు, జిల్లా ప్రజలకు ఏం వరాలు కురిపిస్తారో వేచి చూడాలి.


సత్యనారాయణపురంలోని కల్యాణమండపం

దేవాదాయం

- రూ.కోట్ల విలువైన ఆస్తులు వైసీపీ నేతల పాలు
- సహకరిస్తున్న దేవదాయ శాఖ అధికారులు
- ఎమ్మెల్యే అనుచరుల చేతిలో సీతారామ కల్యాణమండపం
- స్వాధీనానికి 2021లోనే హైకోర్టు ఉత్తర్వులు
- అయినా పట్టించుకోని అధికారులు

దేవదాయ శాఖకు చెందిన కోట్ల రూపాయల విలువైన ఆస్తులు అధికార పార్టీ నేతల కబ్జాలో ఉన్నా అధికారుల్లో చలనం లేదు. వైసీపీ నాయకులతో కుమ్మక్కైన దేవదాయ శాఖ అధికారులు లక్షలాది రూపాయల ఆదాయాన్ని ఇచ్చే ఆస్తులను స్వాధీనం చేసుకోకుండా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారు.

- విజయవాడ-ఆంధ్రజ్యోతి/వన్‌టౌన్

శివాలయంలోనూ స్వాహా

సత్యనారాయణపురంలోని శివాజీ కేఫ్ సెంటర్‌లో కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం ఉంది. ఈ ఆలయానికి 60 ఏళ్ల క్రితం తాడేపల్లి సీతమ్మ 600 గజాల స్థలాన్ని దానంగా ఇచ్చారు. విజయవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 1957లో దేవస్థానం పేరిట రిజిస్టర్ చేయించారు. ఈ స్థలానికి వెనుక మరికొందరు దాతలు 300 గజాలు దేవస్థానానికి ఇచ్చారు. ఈ మొత్తం 900 చదరపు గజాలు. దీని విలువ సుమారు రూ.12 కోట్ల పైమాటే. ఈ స్థలాన్ని కబ్జా చేయడానికి అధికార పార్టీకి చెందిన కొందరు ఎప్పటి నుంచే ప్రయత్నిస్తున్నారు. 2008లో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులుగా పనిచేసినవారు ఈ ఆస్తిపై పెత్తనం సాధించడం మొదలుపెట్టారు. 2010లో నాటి ఈవోను సంప్రదించకుండానే 900 గజాల స్థలాన్ని కొందరు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు తీర్మానం చేశారు. ఈ తీర్మానంపై ట్రస్ట్‌బోర్డు చైర్మన్, శాశ్వత ధర్మకర్తలు సంతకాలు చేయలేదు. దీంతో ఈ తీర్మానానికి విలువ లేకపోవడంతో దేవదాయ శాఖ అధికారులు దాన్ని తోసిపుచ్చారు. 2015లో మరోసారి ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేయగా, ఈ స్థలం ఆలయానికి చెందినదని, దానిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం కుదరదని స్పష్టం చేశారు. అయితే, వైసీపీ అధికారంలోకి వచ్చాక దేవదాయ శాఖ మాజీ మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధి కన్ను దీనిపై పడింది. అప్పటికే ఆ స్థలంలో దాతలు సీతారాముల కల్యాణమండపాన్ని కూడా నిర్మించారు. వైసీపీ నాయకులు రికార్డులు తారుమారు చేసి అసలు ఆ స్థలం దేవదాయ శాఖకు చెందినదే కాదంటూ వాదనలు మొదలుపెట్టారు. ఎట్టకేలకు ఈ స్థలాన్ని, కల్యాణమండపాన్ని స్థానిక ఎమ్మెల్యే బంధుగణానికి అప్పగించారు. దీంతో వారు ఈ కల్యాణమండపం ద్వారా నెలకు రూ.20 లక్షల పైచిలుకు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ఈ మండపం దేవదాయ శాఖదేనంటూ అధికారులు 2020లో కోర్టుకు వెళ్లారు. 2021లో హైకోర్టు సానుకూలంగా ఉత్తర్వులిచ్చింది. కల్యాణమండపాన్ని స్వాధీనం చేసుకోవచ్చంటూ తీర్పు చెప్పింది. కానీ, రాజకీయ ఒత్తిళ్లతో దేవదాయ శాఖ అధికారులు రెండేళ్లు గడిచిపోతున్నా దాన్ని స్వాధీనం చేసుకోవడం లేదు.

న్యాయసలహా కోసం పంపాం : ఈవో

హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి సంబంధిత స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి న్యాయసలహా కోసం రాశామని దేవస్థాన ఈవో తెలిపారు. తాను 2023, అక్టోబరులో బాధ్యతలు స్వీకరించానని, ఆ తర్వాత రికార్డులు పరిశీలించి కల్యాణమండపం ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చామన్నారు.



సరుకు రవాణాలో.. సరికొత్త రికార్డు

- నెల ముందుగానే బెజవాడ రైల్వే ఘనత
- 2023-24 ఫిబ్రవరి 27 నాటికి 33.54 మిలియన్ టన్నుల సరుకు రవాణా.. రూ.3912 కోట్ల ఆదాయం
- కృష్ణపట్నం, కాకినాడ పోర్టులది కీలకపాత్ర
- అత్యధిక సరకు రవాణాలో బొగ్గు, ఎరువులు
- ఈ ఏడాది కొత్తగా కలప వ్యర్థాలు, లేటరైట్

- 6లో..

మరో మోసం

ఆర్ అండ్ ఆర్‌పై ఉత్తుత్తి జీవోలతో ప్రభుత్వ మాయ

- పక్షం రోజుల్లో సమస్య పరిష్కారమని అభయం
- రెండు నెలలువుతున్నా అతీగతీ లేదు
- నాలుగున్నరేళ్లుగా నిర్వాసితుల ఎదురుచూపులు
- భారీ ఆందోళన చేపట్టాలని రహస్య సమావేశం


ఆర్ అండ్ ఆర్ లే అవుట్

విమానాశ్రయ విస్తరణ కోసం ఇళ్లను కోల్పోయిన నిర్వాసితులతో ప్రభుత్వం ఆటలాడుతోంది. జీవోల పేరుతో మాయమాటలు చెప్పి మోసం చేస్తోంది. నిర్వాసితులు నిరసనకు సమాయత్తమవుతున్న దశలో ఉత్తుత్తి జీవోలను విడుదల చేసి మమ.. అనిపిస్తోంది. పక్షం రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని చెప్పిన ప్రభుత్వం రెండు నెలలవుతున్నా పత్తా లేకపోవడంతో ఈసారి అమీతుమీ తేల్చుకోవాలని నిర్వాసితులు నిశ్చయించుకున్నారు. పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టేందుకు రహస్య సమావేశం నిర్వహించారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ విస్తరణ కోసం తమ ఇళ్లను కోల్పోయిన నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు కిందటి టీడీపీ ప్రభుత్వ హయాంలో చిన్న అవుటపల్లిలో 48 ఎకరాలు సేకరించారు. ఈ భూముల్లో లే అవుట్ వేసి మోడల్ గృహాలను కట్టించాలని నిర్ణయించారు. ఇదే సందర్భంలో ఎన్నికలు రావటం, ఆ తర్వాత ప్రభుత్వం మారటంతో నిర్వాసితుల సమస్య అలాగే ఉండిపోయింది. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్‌పై నిర్వాసితులను మభ్యపెడుతూనే వస్తోంది. డబ్బు కేటాయిస్తున్నామంటూ జీవోల పేరుతో నమ్మిస్తూ నయవంచన చేస్తోంది. అధికారంలోకి వచ్చాక దాదాపు రెండేళ్లు సమస్యలను పరిష్కరించకుండా పక్కన పెట్టింది. రైతుల సమస్యలను జిల్లా యంత్రాంగం పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. కానీ, ప్రభుత్వ పెద్దలు ఏమాత్రం పట్టించుకోలేదు.

నిర్వాసితులతో ఆటలు

నిర్వాసితులతో వైసీపీ ప్రభుత్వం మైండ్‌గేమ్ ఆడింది. 'ఇళ్లు మీరే కట్టుకోవచ్చు. డబ్బు మేమిస్తాం..' అనే ఆఫర్ ఇచ్చింది. ఇంటికి రూ.9 లక్షలు ఇస్తామని ప్రకటించింది. అది కూడా రెండు విడతలుగా చెల్లిస్తామని, మొదటి విడతగా రూ.4.50 లక్షలు, రెండో విడతగా రూ.4.50 లక్షలు ఇస్తామని పేర్కొంది. ఈ ప్రతిపాదనను కరోనాకు ఏడాది ముందు ప్రకటించింది. ప్రభుత్వం మభ్యపెడుతున్నప్పటికీ సమస్య పరిష్కారం అవుతుందన్న ఉద్దేశంతో నిర్వాసితులు అంగీకరించారు. కరోనా తర్వాత ఇంటి నిర్మాణ వ్యయం పెరిగిపోయింది. ప్రభుత్వం ఇస్తామన్న బడ్జెట్ సరిపోని పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ నిర్వాసితులే సర్దుకుపోయారు. అయినా నిధులు విడుదల కాకపోవడంతో ఆందోళన ప్రారంభించారు. దీంతో లే అవుట్‌లో కనీసం ప్లాట్లు కూడా కేటాయించని పరిస్థితుల్లో లాటరీ తీశారు. దీంతో నిర్వాసితులు కొంతకాలం ఆందోళన విరమించారు. ఆ పని కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉండటంతో మళ్లీ ఆందోళనకు సమాయత్తమయ్యారు. ఈ నేపథ్యంలో రూ.110 కోట్లు విడుదల చేస్తున్నట్టు ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ డబ్బు కోసం నిర్వాసితులు జిల్లా యంత్రాంగం చుట్టూ తిరిగారు. ఈ డబ్బును ప్రభుత్వం వెనక్కి తీసుకుందన్న సంగతి తెలిసి మళ్లీ నిరసన బాట పట్టారు. దీంతో అధికారులు మళ్లీ హడావిడిగా ప్లాట్ల లాటరీ తీశారు. ఇలా కొంతకాలం గడిపారు. చివరికి నిర్వాసితులు నిరాహార దీక్షకు దిగటంతో ప్లాట్ల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. రిజిస్ట్రేషన్ అయితే చేశారు కానీ, పట్టాలు ఇవ్వలేదు. చిర్రెత్తుకొచ్చిన నిర్వాసితులు విమానాశ్రయ మైనర్ ఇరిగేషన్ కాల్వను తవ్వేస్తామని కార్యాచరణకు పిలుపునిచ్చారు. దీంతో రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను నిర్వాసితులకు అందజేశారు. ఇల్లు నిర్మించుకోవటానికి డబ్బుల్లేవని అడిగితే, మళ్లీ రూ.83 కోట్లు కేటాయిస్తున్నట్టు జీవో ఇచ్చారు. పక్షం రోజుల్లో డబ్బులందుతాయని తెలిపారు. రెండు నెలలవుతున్నా డబ్బు అందకపోవడంతో నిర్వాసితుల్లో తీవ్ర ఆందోళన నెలకొంటోంది. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో మళ్లీ నిర్వాసితులు నిరసన చేపట్టాలని నిర్ణయించుకున్నారు. మైనర్ ఇరిగేషన్ తవ్వకంతో పాటు రన్‌వే మీద విమానాల నిలుపుదల వంటి కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తున్నారు. ఆకస్మికంగా ఆందోళన చేపట్టాలని చూస్తున్నారు.

సీఎం గారూ..ఇసుక దోపిడీపై నోరు విప్పరూ..

- దళితుల సాగు భూములు లాక్కున్నారు..
- ఇళ్లస్థలాలను ఎందుకు ఇవ్వలేకపోయారు
- వర్ల కుమార్ రాజా సూటి ప్రశ్న

- 6లో..



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న దుర్గాభవాని

మద్యంపై మాటతప్పిన జగన్‌ను గద్దె దింపుతాం

- మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 29 : దశల వారీగా మద్య నిషేధం చేస్తానని నమ్మించి మహిళల ఓట్లతో గెలిచి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ గద్దె దింపేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారని మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మత్స దుర్గాభవాని అన్నారు. రాష్ట్రంలో మద్య నిషేధం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం వైఎస్సార్ కాలనీ వద్ద ఉన్న బార్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలతో బార్ నిర్వాహకులు వాగ్వాదానికి దిగడంతో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడకు చేరుకున్న పోలీసులు సర్ధిచెప్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ సందర్భంగా దుర్గాభవాని మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఊరూరు తిరిగి దశల వారీగా మద్యపాన నిషేధం అమలు చేస్తానని జగన్ ఇచ్చిన హామీని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే నిషేధ హామీని గాలికి వదిలేసి మద్యంపై వచ్చే ఆదాయాన్నే ప్రధాన వనరుగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనధికారికంగా రాష్ట్రంలో 70వేలకు పైగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయన్నా. రానున్న ఎన్నికల్లో జగన్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు పంచదార్ల దుర్గాంబ, బంకా ఝాన్సీ, భారతి, మేకల కుమారి, పార్వతి, జ్యోతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో టీడీపీ తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ

జగన్‌కు రైతులే బుద్ధి చెబుతారు

- తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 29 : ఉత్తిత్తి బటన్లు నొక్కి రైతులను సీఎం జగన్‌మోసం చేస్తున్నారని టీడీపీ కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ ఆరోపించారు. గురువారం బందరు మండలం కానూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లబొల్లి మాటలు చెప్పి జగన్‌రెడ్డి మోసపూరిత హామీలతో రైతుల ఓట్లు దండుకున్నారన్నారు. ప్రభుత్వమే ఇన్సూరెన్సు ప్రీమియం సొమ్ము కడుతుందని చెప్పి ఒక్క రూపాయి కూడా కట్టలేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందలేదని, బ్యాంకుల నుంచి బకాయిలు చెల్లించాలని నోటీసులు వస్తున్నాయన్నారు. సున్నా వడ్డీ రుణాలిస్తే రైతులు ఆరువేలు వడ్డీ ఎందుకు చెల్లించాలన్నారు. పట్టిసీమ జలాలే కృష్ణాడెల్టాకు గతయ్యాయన్నారు. రైతులను వంచించే జగన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో తెలుగురైతులు డి.మహేష్, జి.వెంకటరమణ, సీహెచ్ కొండ, వై.నాయుడు, జి.నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం సభతో తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లింది



- టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయం : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 29 : తాడేపల్లిగూడెంలో జరిగిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల సభను చూసిన తాడేపల్లిలోని జగన్‌రెడ్డి ప్యాలెస్ దద్దరిల్లిందని మాజీ ఎంపీ, కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. గురువారం మచిలీపట్నంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన విజయం, వైసీపీ పూర్తిగా ఖాళీ అయ్యే తరుణం ఆసన్నమైందన్నారు. టీడీపీ, జనసేన కలయిక రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకోసమే అన్నారు. పులివెందులలో జగన్‌రెడ్డికి ఓటమి తప్పదన్నారు. టీడీపీ, జనసేన అధికారంలోకి రాగానే సాగునీరందించి రైతులను ఆదుకుంటామని, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని కొనకళ్ల హామీ ఇచ్చారు.

రుషికొండపై అక్రమ నిర్మాణాలు! : దేవినేని ఉమా



గొల్లపూడి, ఫిబ్రవరి 29 : రుషికొండకు గుండు కొట్టి వందల కోట్ల ప్రజాధనంతో నిబంధనలకు విరుద్ధంగా దానిపై భవనాలు నిర్మించారని సీఎం జగన్‌పై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. గురువారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, పేదల ఇళ్లు కూలుతుంటే జగన్ ప్యాలెస్‌లు వెలిగిపోతున్నాయన్నారు. కేంద్ర నిధులతో పాటు లబ్ధిదారుడి నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి, తామే కట్టించి ఇస్తామని ఒక్క పైసా ఖర్చు పెట్టకపోగా నిర్మాణం పేరుతో దోపిడీ చేశారన్నారు. నాశిరకం నిర్మాణాలతో లబ్ధిదారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. దోచుకో, దాచుకో విధానంతో తాడేపల్లి ఖజానా నింపుకున్న వైఎస్ జగన్ ప్రజల జీవితాలను అంధకారంలోకి నెట్టారని ఉమా ధ్వజమెత్తారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 29 : గుడివాడ నియోజకవర్గంలో తెలుగు దేశం పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని నియోజకవర్గ ఇంచార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. గురువారం మల్లాయి పాలెం, శ్రీకాళహస్తీ కాలనీ, దొండపాడు కాలువ తదితర ప్రాంతాల్లో 'బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ నాయకులు కొలుసు శాస్త్రి ఆధ్వర్యంలో 100 మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, చంద్రబాబు నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని, తెలుగుదేశం పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన గుడివాడ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నేతలు వాసే మురళీ, తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వెనిగండ్ల రాము, రావి

బంటుమిల్లి : రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక రామవరపు మోడీ గ్రామానికి చెందిన సుమారు 50 వైసీపీ కుటుంబాలు టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. కాగిత కృష్ణప్రసాద్ విజయానికి సైనికుల్లా పోరాటం చేస్తామని వారు అన్నారు. గూడవల్లి ఏడుకొండలు, కాగిత వెంకన్న, గూడవల్లి శ్రీనివాసరావు, నరసింహారావు, బడుగు రవి తదితర కుటుంబాలు టీడీపీలో చేరారు.


రామవరపు మోడీ గ్రామంలో టీడీపీ కండువాలు కప్పుకున్న గ్రామస్థులు

సరుకు రవాణాలో.. సరికొత్త రికార్డు





(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

సరుకు రవాణాలో కిందటి ఆర్థిక సంవత్సరంలో నమోదు చేసిన రికార్డును బద్దలు కొట్టి ఆల్‌టైమ్ రికార్డు దిశగా విజయవాడ రైల్వే డివిజన్ అడుగులు వేస్తోంది. 2022-23లో 33.5 మిలియన్ టన్నుల సరుకు రవాణాను 2023-24లో ఫిబ్రవరి నెలాఖరుకి అధిగమించింది. ఆర్థిక సంవత్సరం ముగియటానికి మరో నెలరోజుల సమయం ఉంది. సరుకు రవాణా ఆదాయంలో విజయవాడ డివిజన్ సరికొత్త రికార్డు నమోదుచేయనుంది. గత ఏడాది 33.5మిలియన్ టన్నుల రవాణా

- నెల ముందుగానే బెజవాడ రైల్వే ఘనత
- 2023-24 ఫిబ్రవరి 27 నాటికి 33.54 మిలియన్ టన్నుల సరుకు రవాణా.. రూ.3,912 కోట్ల ఆదాయం
- కృష్ణపట్నం, కాకినాడ పోర్టులది కీలక పాత్ర
- అత్యధిక సరకు రవాణాలో బొగ్గు, ఎరువులు
- ఈ ఏడాది కొత్తగా కలప వ్యర్థాలు, లేటరైట్

ద్వారా వియవాడ డివిజన్ రూ.3675.28 కోట్ల ఆదాయాన్ని సాధించింది. ఈ ఏడాదిలో ఫిబ్రవరి 27 నాటికే 33.54 మిలియన్ టన్నుల సరుకు రవాణా ద్వారా రూ.3912 కోట్ల ఆదాయాన్ని సాధించటం విశేషం. ఇంకా నెలరోజుల సమయం ఉండటంతో మరో రూ.1000 కోట్ల ఆదాయాన్ని సాధించటానికి అవకాశాలున్నాయని రైల్వే అధికారులు భావిస్తున్నారు. రూ.5000 కోట్ల ఆదాయం డివిజన్ ఉన్నతాధికారుల లక్ష్యంగా ఉంది. డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ పర్యవేక్షణ, సీనియర్ కమర్షియల్ డివిజినల్ మేనేజర్ వి.రాంబాబుల యాక్షన్ ప్లాన్ ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషి ఫలితంగా విజయవాడ రైల్వే డివిజన్ సరికొత్త రికార్డు నమోదుచేసేందుకు సిద్ధమౌతోంది. వ్యాగన్ టర్న్ అరౌండ్ పెరగటం వల్ల కూడా ఈ ఏడాది ఆదాయం గణనీయంగా పెరగటానికి దోహదపడింటున్నారు.

ఆదాయంలో ముందువరుసలో అదాని కృష్ణపట్నం, కాకినాడ సీ పోర్టులు

విజయవాడ రైల్వే డివిజన్ ఆల్‌టైమ్ సరుకు



రవాణా రికార్డు వెనుక ప్రధాన ఆదాయమార్గాలుగా పోర్టులు నిలుస్తున్నాయి. పోర్టులకు సరుకు లోడింగ్, అన్‌లోడింగ్‌ల ద్వారానే డివిజన్‌కు ఇంత భారీ ఆదాయం సమకూరింది. రైల్వే ఆదాయంలో కృష్ణపట్నం పోర్టు ప్రథమ స్థానంలో, రెండవ స్థానంలో కాకినాడ సీ పోర్టు నిలిచాయి.

ప్రధాన వస్తువులుగా బొగ్గు, ఎరువులు

రైల్వే సరుకు రవాణా ప్రధాన వస్తువుగా బొగ్గు నిలిచింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 18 మిలియన్ టన్నుల బొగ్గును డివిజన్ పరిధిలో రవాణా చేయటం జరిగింది. ఆ తర్వాత ఎరువులు రెండో స్థానంలో నిలిచాయి. ఎరువులను 6.4 మిలియన్ టన్నుల మేర రవాణా చేయటం జరిగింది. సరకు రవాణాలో ఈ రెండు ప్రధాన స్థానాన్ని ఆక్రమించటం విశేషం.

బీడీయూలతో వస్తువుల రవాణా

డివిజన్ పరిధిలో సరుకు రవాణాను పెంపొందించేందుకు ఉన్నతాధికారులు బిజినెస్ డెవలప్‌మెంట్ యూనిట్స్ (బీడీయూ)లను ఏర్పాటు చేయటం జరిగింది. స్థానికంగా ఎక్కడికక్కడ బీడీయూ టీమ్‌లను ఏర్పాటు చేశారు. స్థానికంగా అన్ని రకాల ఉత్పాదక సంస్థలను గుర్తించి ఆయా సంస్థలతో చర్చలు జరిపి రైళ్లలో సరుకు రవాణా చేపట్టేలా కృషి చేశారు. కలప వ్యర్థాలు, లేటరైట్ రవాణా కూడా ఈ ఏడాది చేపట్టారు. రోడ్డు మార్గాన వెళ్లే అనేక సరుకులను తక్కువ ఖర్చుతో రైళ్ల ద్వారా రవాణా చేసేలా బీడీయూ బృందాలు కృషి చేశాయి.

ఫలించిన సంస్కరణలు

సరుకు రవాణాలో దేశస్థాయిలో ఆల్‌టైమ్ రికార్డు ఘనతను సాధించటానికి ఇటీవల కాలంలో అమలు చేసిన సంస్కరణలు కూడా దోహదపడ్డాయి. గతంలో కంటే భారీగా సరుకును తరలించే పరిస్థితులను సృష్టించడంతో పాటు, గూడ్స్ షెడ్‌లను ఆధునీకరించటం, వినియోగదారులకు సౌకర్యాలను కల్పించటం వంటివి కూడా కలిసొచ్చాయి.

ఇది గొప్ప విజయం

- నరేంద్ర ఆనంద్ పాటిల్, డీఆర్ఎం



సరుకు రవాణాలో ఈ ఆర్థిక సంవత్సరం రూ. 5 వేలకోట్ల మైలురాయికి చేరుకోబోతుండటం గర్వకారణం. గత ఆర్థిక సంవత్సరం ఘనతను ఈ ఏడాది అధిగమించటం గొప్పగా ఉంది. కమర్షియల్ విభాగం పూర్తిస్థాయిలో పనిచేయటం వల్ల ఇది సాధ్యమైంది. అన్ని విభాగాలు సమన్వయంతో లక్ష్యసాధనకు కృషిచేశాయి. విజయవాడ డివిజన్‌కు సంబంధించి కాకినాడలో వరల్డ్ క్లాస్ గూడ్స్ షెడ్‌ను నిర్మించబోతున్నాం.

నేడు పామర్రుకు సీఎం జగన్


ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

- ఐదో విడత విద్యాదీవెన నగదు పంపిణీ
- ఏర్పాట్లు పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ
- సీఎం సభకు డ్వాక్రా మహిళలు, విద్యార్థులను తరలించాలని ఆదేశాలు!

పామర్రు, ఫిబ్రవరి 29 : ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన పామర్రుకు రానున్నారు. విజయవాడ రోడ్డులోని దేవస్థాన భూముల్లో ఏర్పాటు చేసిన జగనన్న విద్యాదీవెన పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరుకానున్నారు. సభ వేదిక ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు తదితర ఏర్పాట్లను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. బందరు రోడ్డు మార్కెట్ యార్డు సమీపంలో హెలిప్యాడ్, సభాప్రాంగణ ఏర్పాట్లను ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి కృష్ణా కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ నయీమ్ అస్మి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ తదితరులు పరిశీలించారు. సభకు డ్వాక్రా మహిళలు, విద్యార్థులను తరలించాలని యానిమేటర్లను ఆదేశించినట్లు సమాచారం. సభకు రాకుంటే సంక్షేమ పథకాలు నిలుపుదల చేస్తామంటున్నారని డ్వాక్రా సంఘ సభ్యులు బహిరంగానే చెబుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల దారి మళ్లింపునకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇద్దరు అడిషనల్ ఎస్పీలు 11 మంది డీఎస్పీలు, 28మంది సీఐలు, 65మంది ఎస్ఐలతోపాటు సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ముఖ్యమంత్రి సభా ప్రాంగణంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అన్ని చర్యలు పాటించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. సభావేదిక వద్ద ఫంక్షన్ హాల్లో అధికారులతో ఆయన మాట్లాడారు. సమావేశంలో జేసీ గీతాంజలి శర్మ జెడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఆర్డీఏ పీడీ ప్రసాద్, హౌసింగ్ పీడీ జీవీ సూర్యనారాయణ, ఉయ్యూరు, గుడివాడ, బందరు ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఇలా

ఉదయం 10 గంటలకు తాడేపల్లి నుంచి సీఎం జగన్మోహనరెడ్డి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.30కి పామర్రుకు చేరుకుంటారు. 10.50కి సభా ప్రాంగణానికి చేరుకుంటారు. నేతల ప్రసంగాల అనంతరం విద్యాదీవెన లబ్ధిదారులతో సీఎం మాట్లాడనున్నారు. అనంతరం విద్యాదీవెన సాయం బటన్ నొక్కి విడుదల చేస్తారు. హెలికాప్టర్‌లో తిరిగి తాడేపల్లికి వెళతారు.

ట్రాఫిక్ మళ్లింపు

గుడివాడ వైపు నుంచి అవనిగడ్డ వెళ్లే వాహనాలను బైపాస్ రోడ్డు నుంచి వయానిడుమోలు మీదుగా, విజయవాడ వైపు నుంచి అవనిగడ్డ వెళ్లే వాహనాలను కరకట్టమీదుగా దారి మళ్లించారు. గ్రామంలోని అన్ని రహదారుల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు.


నారా లోకేశ్‌ను కలిసిన జలీల్‌ఖాన్, కేశినేని శివనాథ్

టీడీపీతోనే నడుస్తా : జలీల్‌ఖాన్

వన్‌టౌన్, ఫిబ్రవరి 29 : ఇటీవల టీడీపీ నుంచి వైసీపీలోకి వెళతారన్న ప్రచారం జరిగిన పశ్చిమ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ గురువారం కేశినేని శివనాథ్(చిన్ని)తో కలిసి నారాలోకేశ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, జలీల్‌ఖాన్ భవిష్యత్తు పూచీ తనదని తెలిపారు. జలీల్‌ఖాన్ మాట్లాడుతూ, టీడీపీలోనే కొనసాగుతానని, రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం మైనార్టీల మద్దతు కూడగడతానని, లోకేశ్‌కు తెలిపారు. వైసీపీ నేతలను కలవడం యాదృచ్ఛికమే అన్నారు. ఏది ఏమైనా వచ్చే ఎన్నికల్లో పోటీలో ఉంటానని స్పష్టం చేశారు. టిక్కెట్ ఇస్తే 30వేల ఓట్ల మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

సీఎం గారూ.. ఇసుక దోపిడీపై నోరు విప్పరూ!

- దళితుల సాగు భూములు లాక్కున్నారు..
- ఇళ్లస్థలాలను ఎందుకు ఇవ్వలేకపోయారు
- వర్ల కుమార్‌రాజా సూటి ప్రశ్న



తోట్లవల్లూరు, ఫిబ్రవరి 29 : పామర్రు వస్తున్న సీఎం జగన్.. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి వర్ల కుమార్‌రాజా డిమాండ్ చేశారు. రొయ్యూరులో గురువారం పల్లెబాట కార్యక్రమంలో భాగంగా విలేకరుల సపమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో జగన్ పాదయాత్ర సందర్భంగా పామర్రు బహిరంగ సభలో టీడీపీ అమలు చేస్తున్న ఉచిత ఇసుక పథకంలో అవినీతి జరుగుతోందని నిందలు వేసి, తాను సీఎం అయితే ఇసుక దోపిడీ లేకుండా చేస్తామని చెప్పి ఇపుడు ఏమి చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. రొయ్యూరు, లంకపల్లి తదితర క్వారీల్లో యంత్రాలతో ఎన్నడూ లేనంతగా ఇసుక దోపిడీ జరుగుతోందన్నారు. సుప్రీంకోర్టు, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ సైతం ఇసుక అక్రమాలను నిర్ధారించాయన్నారు. అయినా సిగ్గూఎగ్గూ లేకుండా దోపిడీని కొనసాగిస్తున్నది నిజం కాదా.. అని ప్రశ్నించారు. నా ఎస్సీలంటూ కల్లబొల్లి కబుర్లు చెబుతూ తోట్లవల్లూరులో 40 ఏళ్లుగా దళితులు సాగుచేసుకునే తొమ్మిది ఎకరాల వ్యవసాయ భూములను జగనన్న ఇళ్లస్థలాల పేరుతో బలవంతంగా లాక్కుని ప్రజలకు ఇళ్లు ఇవ్వకుండా, దళితులకు చెందకుండా చేయటంపై సమాధానం చెప్పాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రజలను వంచించిన తీరుపై జగన్ సమాధానమివ్వాలన్నారు.


రిజిస్టర్ పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గోడౌన్ల వద్ద నిరంతర నిఘా

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గొల్లపూడి, ఫిబ్రవరి 29 : ఈవీఎంలను భద్రపరిచే గోడౌన్ వద్ద నిరంతరం పటిష్ఠమైన నిఘా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గొల్లపూడి మార్కెట్ యార్డ్‌లోని ఈవీఎం గోడౌన్‌ను ఆయన గురువారం పరిశీలించారు. రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఈవీఎం, బీయూలు, సీయూలు, వీవీ ప్యాట్‌ల భద్రతా చర్యలను పరిశీలించారు. ఆయనతో పాటు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఈవీఎం నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరరావు, ఎం.దుర్గా ప్రసాద్, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 5,82,423 ఆరోగ్య శ్రీకార్డులు

వన్‌టౌన్,ఫిబ్రవరి 29 : ఎన్టీఆర్ జిల్లాలో 5,82,423 ఆరోగ్య శ్రీకార్డులకుగాను ఇప్పటి వరకు 4,11,790 కార్డులు పంపిణీ చేశారు. మిగతా 32,160 కార్డుల్లో 20 వేల కార్డుల వరకు ఇతర ప్రాంతాలకు వలస పోయినవారు, మరణించిన వారికి చెందినవని జిల్లాకలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్డుల పంపిణీ పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అర్హులైన పేద, మధ్యతరగతి ప్రజలకు డాక్టర్ వైఎస్ ఆర్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల ద్వారా 25 లక్షల రూపాయల వ్యయం గల వైద్య సేవలు ఉచితంగా అందుతాయన్నారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలను ఆయన అధికారులకు సూచిస్తూ, నూరుశాతం కార్డుల పంపిణీ జరగాలన్నారు. జిల్లా కో-ఆర్డినేటర్ జె.సుమన్, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పునర్నిర్మాణ ఆలయాలు ప్రారంభం




వన్‌టౌన్, ఫిబ్రవరి 29 : 2016 కృష్ణా పుష్కరాల సమయంలో వన్‌టౌన్ ప్రాంతంలో తొలగించిన ఆలయాలను పండితులు గురువారం ఉదయం 11.24 గంటలకు పునఃప్రారంభించారు. ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిఖర కలశాలకు కుంభాభిషేకం నిర్వహించారు. స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, ఉపప్రధాన అర్చకుడు శంకర శాండిల్య, ముఖ్య అర్చకుడు యజ్ఞనారాయణ తదితరులు పూజలు నిర్వహించారు. దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, ఈవో కేఎస్ రామారావు, ట్రస్టుబోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, సభ్యులు పాల్గొన్నారు. దుర్గగుడి పాత మెట్లవద్ద వినాయకునిగుడి, సీతమ్మవారి పాదాల వద్ద పంచముఖ ఆంజనేయస్వామి, బొడ్డుబొమ్మ తదితరాలను ప్రారంభించారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 29 : వివిధ రంగాల్లో సేవలందించే వారిని ప్రోత్సహించే లక్ష్యంతో సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ (హైదరాబాద్) ఆధ్వర్యంలో ఏప్రిల్ 7న ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణమాష్టారు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభావంతులను గుర్తించి పురస్కారాలు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, విద్య వైద్యం, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, ఆధ్యాత్మికం, వ్యవసాయం, ఉపాధి కల్పన, నాటక, టీవీ, సినీ రంగాల్లో సేవలందిస్తున్న వారు మార్చి 15వ తేదీలోగా దరఖాస్తు చేయాలని కోరారు. సేవలు, ప్రతిభ తెలయజేసే సర్టిఫికెట్లు, ఫోటోలు, పత్రికల క్లిప్పింగ్స్, గతంలో పొందిన పురస్కారాలు, సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలకు 4 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు జతచేసి సికింద్రాబాద్‌లోని సంస్థ కార్యాలయానికి పంపాలని కోరారు. ఇతర వివరాలకు 96523 47207 నెంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉమ్మడి కృష్ణాలో లీగల్ మెట్రాలజీ శాఖ దాడులు


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పెనమలూరు, ఫిబ్రవరి 29: ప్రభుత్వ లీగల్ మెట్రాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం అధికారులు ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పలు దుకాణాలపై దాడులు నిర్వహించారు. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణకు ఈదాడులు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. బియ్యం దుకాణాలు, రైల్వేస్టేషన్లు, బస్ స్టేషన్లలోని వివిధ దుకాణాలపై దాడులు నిర్వహించి తనిఖీలు చేసినట్టు తెలిపారు. జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ పోర్టల్, వినియోగదారులు హెల్ప్‌లైన్ 1967 ద్వారా రైల్వే స్టేషన్లు, బస్‌స్టేషన్లలో కూల్‌డ్రింక్స్, ఇతర ప్యాకేజీ చేయబడిన వస్తువులకు అదనపు ధర, తూకం పరికరాల్లో తారుమార్లు, తక్కువ బరువుతో స్టీల్ అమ్మడం, 26కిలోల బరువుండాల్సిన బియ్యం సంచుల్లో 25కిలోల బియ్యం మాత్రమే ఉండడం వంటి అవకతవకలను గుర్తించి కేసులు నమోదు చేసినట్టు వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌరసరఫరాల శాఖ కార్యదర్శి హెచ్.అరుణ్‌కుమార్ తెలిపారు.

నేటినుంచి ఇంటర్ పరీక్షలు

వన్ టౌన్, ఫిబ్రవరి 29 : రాష్ట్రంలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శనివారం నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. ఈమేరకు పరీక్షల నిర్వహణకు ఇంటర్మీడియెట్ విద్యామండలి అన్ని ఏర్పాట్లు చేసింది. మార్చి 19తో మొదటి సంవత్సరం పరీక్షలు, 20తో ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగియనున్నాయి. మార్చి ఒకటో తేదీన ద్వితీయ భాష, 4వతేదీన ఇంగ్లీషు, 6వతేదీన గణితం, వృక్షశాస్త్రం, పౌరశాస్త్రం, 9వతేదీన గణితం 1బి, జంతు శాస్త్రం, చరిత్ర, 12వతేదీన భౌతిక శాస్త్రం, అర్థశాస్త్రం, 14 వతేదీ రసాయన శాస్త్రం, వాణిజ్య శాస్త్రం, సమాజ శాస్త్రం, లలితకళలు, 16 వతేదీ ప్రభుత్వపాలనా శాస్త్రం, తర్కశాస్త్రం, బీపీసీ విద్యార్థుల కోసం బ్రిడ్జికోర్సు, గణితం, 19వతేదీ ఆధునిక భాష, భౌగోళికం పరీక్షలు జరుగుతాయి.

ఏపీ టెట్‌కు 78 శాతం హాజరు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 29 : కృష్ణాజిల్లాలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో గురువారం జరిగిన ఏపీ టెట్ పరీక్షల్లో 3612 మందికి 2828 మంది (78 శాతం) విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 1808 మందికి 1409, మధ్యాహ్నం 1804 మందికి 1419 మంది హాజరయ్యారు. మచిలీపట్నం ఎస్‌విహెచ్ ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలకులు కె.శ్రీనివాసరెడ్డి, డైట్ ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణలు సందర్శించారు.

స్నాతకోత్సవం దరఖాస్తుల గడువు పొడిగింపు

మచిలీపట్నం టౌన్ : కృష్ణా విశ్వవిద్యాలయంలో స్నాతకోత్సవం నిర్వహించనున్న దృష్ట్యా ఒరిజినల్ డిగ్రీ కోసం మార్చి 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచినట్టు రిజిస్ట్రార్ పి.వీరబ్రహ్మచారి తెలిపారు. విద్యార్థులు నేరుగా విశ్వవిద్యాలయంలో గాని, పోస్టు ద్వారా గాని దరఖాస్తులు పంపవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాట్య కళాపీఠం ఎంపీఏ విద్యార్థులకు బంగారు పతకాలు


పతకాలు పొందిన విద్యార్థులు

కూచిపూడి, ఫిబ్రవరి 29 : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళా పీఠం ఎంపీఏ విద్యార్థుల్లో నలుగురికి బంగారు పతకాలు లభించినట్టు కళాపీఠం ప్రధానాచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020-22 విద్యాసంవత్సరంలో హాజరైన 11 మంది విద్యార్థులలో జి.గాయత్రి, ఆర్.వసంత్ కిరణ్, 2021-23 విద్యాసంవత్సరంలో హాజరైన 17 మంది విద్యార్థులలో పి.దుర్గాభవాని, బి.మల్లికార్జునరావులు విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన స్నాతకోత్సవ వేడుకల్లో కులపతి, తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ నుంచి బంగారు పతకాలు, ప్రశంస పత్రాలను అందుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య టి.కిషన్‌రావు, ఆచార్య భట్టు రమేష్‌బాబు, కళాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు ఎంపీఏ క్లాస్ అధ్యాపకులు తదితరులు అభినందించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం అవసరం

గన్నవరం, ఫిబ్రవరి 29: ప్రభుత్వంతోపాటు దాతల సహకారం తోడైతే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి మరింత సాధ్యమని జడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, ఎంపీపీ అనగాని రవి అన్నారు. దావాజీగూడెం జడ్పీహైస్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం భోజనశాల నిర్మాణానికి రూ.20లక్షలు బుద్ధవరానికి చెందిన మాగంటి మురళీ అందజేయగా గురువారం ఆయన తల్లి వాణిమ్మ శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ పాఠశాలలో వసతుల కల్పనకు దాతల సహకారం ఎనలేనిదన్నారు. మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య మాట్లాడుతూ ముక్కామల జగదీశ్వరరావు పేరుతో స్థాపించిన పాఠశాలలోవంట, భోజనశాల నిర్మాణానికి ఆయన మనవడు ముందుకు రావటం అభినందనీయమన్నారు. హెచ్ఎం వి.రజనీకుమారి, మెట్లపల్లి రాంబాబు, గుర్రం నరసయ్య, పొన్నగంటి శివ, మద్దినేని వెంకట్రావు, బడుగు మరియదాసు, బి.పున్నమ్మదేవి పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి భూమిపూజ



హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 29: స్థానిక ధర్మకోనేరు చెరువు ప్రాంతంలో నూతన శ్రీ భ్రమరాంబ సమేత శ్రీవల్లి మల్లికార్జున స్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు కొల్లి వెంకట్రావు, గూడవల్లి చిన్న దంపతులతో పాటు పలువురు దంపతులు, గ్రామస్థులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కోటి రూపాయల అంచనా వ్యయంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామ పెద్దలు సుంకర సుభాష్ చంద్రబోస్, నందూరు సత్య వేంకటేశ్వర శర్మ, గూడవల్లి రత్నశేఖర్, వడ్డిల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి వైద్యఖర్చులకు ఆర్థికసాయం



గన్నవరం, ఫిబ్రవరి 29: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవటం మానవ ధర్మమని ప్రముఖ న్యాయవాది, కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఛైర్మన్ కేవీ రమణ అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న వెలగపూడి శ్రీకర్ వైద్య ఖర్చులకు కేవీఆర్ ఇండోర్ షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు ఫౌండర్ కేవీ ఆర్ కిషోర్ రూ.27వేలు ఆర్థిక సహాయాన్ని గురువారం కేవీ రమణ చేతుల మీదుగా విద్యార్థి తల్లికి అందజేశారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థికి తమ వంతు సహాయం చేయటం అభినందనీయమన్నారు. విద్యార్థి తల్లితో మాట్లాడి సలహాలు తగు సూచనలు ఇచ్చారు. చందు, ఆలీ, నళిని కుమార్, భగవాన్, డీపీ, జాన్, శ్రీను, రూప్, ప్రేమ్, వెంకీ, చిన్నారావు, బుజ్జారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా డిగ్రీ విద్యార్థుల ఫేర్‌వెల్ డే



గన్నవరం, ఫిబ్రవరి 29: స్థానిక వేములపల్లి కోదండ రామయ్య కళాశాలలో బీకాం తృతీయ సంవత్సర విద్యార్థుల ఫేర్‌వెల్‌డే గురువారం ఉత్సాహం, ఉల్లాసంగా జరిగాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, డ్యాన్స్‌లు అదరగొట్టాయి. కామర్స్ విభాగం హెడ్ ముత్యాల జ్యోతి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యసాధనతో ముందుకు వెళ్లినప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని చెప్పారు. ఇంగ్లీష్ అధ్యాపకురాలు తేజో కుమారి మాట్లాడుతూ డిగ్రీ తరువాత మంచి కోర్సులు అందుబాటులో ఉన్నాయని, వాటిలో రాణించి, మంచి ఉద్యోగాలు సాధించి జూనియర్‌లకు ఆదర్శంగా ఉండాలన్నారు. అధ్యాపకులు పడమట రాంబాబు, వినీల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో టీడీపీ గెలుపు నల్లేరుపై నడకే

కంకిపాడు, ఫిబ్రవరి 29 : పామర్రులో టీడీపీ గెలుపు నల్లేరుపై నడకే అని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందిపాటి సుధాకర్ అన్నారు. పామర్రు ఎమ్మెల్యే అభ్యర్థిగా వర్లకుమార్ రాజాను ప్రకటించటంతో గురువారం ఆయనను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో సుధాకర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో భారీ మెజారిటీతో టీడీపీ విజయం సాధిస్తుందని జోస్యం చెప్పారు. పెనమలూరు నియోజకవర్గ అభ్యర్థిగా గత 12 ఏళ్లుగా నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అండగా ఉంటూ వస్తున్న బోడె ప్రసాద్ పేరును కూడా చంద్రబాబు త్వరితగతిన ప్రకటించాలని కోరారు. స్థానిక టీడీపీ నాయకులు చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు మద్దతు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 29: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తు జంక్షన్‌లో రెండు రోజులు పాటు స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ)హనుమాన్‌జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం విరమించారు. శిబిరాన్ని చలసాని ఆంజనేయులు సందర్శించి మద్దతు పలికారు. ముగింపు సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు కళ్లం వెంకటేశ్వరరావు దీక్షలో పాల్గొన్న కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కార్మికుల హక్కులను కాలరాస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో కార్మిక వర్గం గుణపాఠం చెప్పాలన్నారు. 1214 మెమోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముఠా వర్కర్స్, అంగ్‌వాడీ కార్యకర్తలు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ బాపులపాడు మండల అధ్యక్ష కార్యదర్శులు బేత శ్రీనివాసరావు, నల్లి ఆంజనేయులు, జే.ఏసుపాదం, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు చింతా రాఘవయ్య, గిరి, రాజనాల సురేష్, నోచర్ల నాగేశ్వరరావు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



గన్నవరంలో దీక్షలో కూర్చున్న భవన నిర్మాణ కార్మికులు

మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం..

గన్నవరం: భవన నిర్మాణ కార్మికులను వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు బడుగు మరియదాస్ అన్నారు. స్థానిక సుందరయ్య విగ్రహం వద్ద గురువారం రెండో రోజు భవన నిర్మాణ కార్మికులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మరియదాస్ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగించాలని, 1214మెమోను రద్దు చేసి సంక్షేమ పథకాలు బోర్డు ద్వారా అమలు జరిపించాలని డిమాండ్ చేశారు. వెంటనే రద్దు చేయకపోతే రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి కార్మికులు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి

ఉయ్యూరు: ఉయ్యూరులో లేబర్ ఆఫీసర్ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం నిరసన దీక్ష చేపట్టారు. కార్మిక సంక్షేమ బోర్డును పునః ప్రారంభించి క్లైమ్‌లు ఇవ్వాలని, అపరిష్కృతంగా ఉన్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా నాయకులు టి.నరేశ్, బి.రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో కార్మిక శాఖ కార్యాలయం వద్ద దీక్ష



వీరమ్మ తిరునాళ్లకు భక్తుల రద్దీ

ఉయ్యూరు, ఫిబ్రవరి 29 : వీరమ్మ తిరునాళ్లకు భక్తుల రద్దీ పెరుగుతుంది. తిరునాళ్ల 11వ రోజైన గురువారం వేకు వజాము నుంచి ఆలయం వద్ద భక్తుల రద్దీ కన్పించింది. సోమవారంతో తిరునాళ్ల ముగియనున్న నేపథ్యంలో అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. అమ్మవారికి పసుపు కుంకుమ, చీర సారె సమర్పించేందుకు ఆలయ ప్రాంగణంలో దుకాణాలు మహిళలతో కిటకిటలాడుతున్నాయి.

ప్రసాదం పంపిణీ

వీరమ్మ తిరునాళ్లలో భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు ప్రసాదం పంపిణీ చేస్తున్నాయి. పద్మశాలీ సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వేలాది మందికి పులిహోర, చక్కర పొంగలి ప్రసాదంగా పంపిణీ చేశారు. పలువురు చలివేంద్రాలు ఏర్పాటు చేసి తాగునీరు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.



తిరునాళ్లలో కొనుగోళ్లు

అంగన్వాడీ కార్యకర్తకు డాక్టరేట్



కుక్కల మాధవి

పెనమలూరు, ఫిబ్రవరి 29: యనమలకుదురులో అంగన్వాడీ కార్యకర్తగా పని చేస్తున్న కుక్కల మాధవికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో మహిళల భాగస్వామ్యంపై అధ్యయనం అనే శీర్షికతో ప్రొఫెసర్ త్రిమూర్తిరావు మార్గదర్శకత్వంలో మాధవి సమర్పించిన థీసిస్‌కు డాక్టరేట్ ప్రదానం జరిగింది.

ఓటర్ల జాబితాపై దృష్టి సారించాలి

పెనమలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బోడె ప్రసాద్



క్లస్టర్, బూత్ కన్వీనర్లతో మాట్లాడుతున్న బోడెప్రసాద్

కాటూరు(ఉయ్యూరు), ఫిబ్రవరి 29 : ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో గ్రామంలో ఓటర్ల జాబితాపై దృష్టి సారించాలని పెనమలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బోడె ప్రసాద్ సూచించారు. కాటూరులో గురువారం క్లస్టర్, కన్వీనర్లు, బూత్ ఇన్‌చార్జ్‌లతో ఓటర్ల జాబితా, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఓటర్ల జాబితాలో అధికార పార్టీ నాయకులు అవక తవకలకు పాల్పడ్డారని, టీడీపీ ఓట్లు తొలగింప జేసినట్లు అన్ని చోట్ల నుంచి సమాచారం వస్తుంద న్నారు. తొలగించిన ఓట్లు తిరిగి చేర్పించి వైసీపీ అరాచకాలను ఎదుర్కోవాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, కొండా ప్రవీణ్, ఎస్ వెంకటనారాయణ, సజ్జా మధు, వేమూరు శ్రీనివాసరావు, సూరపనేని వరప్రసాద్, గుర్రం చంద్రశేఖర్, యుగబాబు, గోలి వసంతకుమార్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధి : యార్లగడ్డ

గన్నవరం, ఫిబ్రవరి 29: వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి, పారిశ్రామిక రంగం పూర్తిగా నష్టపోయిందని, రాష్ట్రాన్ని పునఃనిర్మించి, అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన పార్టీలు పొత్తు పెట్టుకున్నాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు గురువారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం జెండా సభ సూపర్ హిట్‌తో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని నిర్ణయానికి వచ్చిన వైసీపీ నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం రూ.5 అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం పెడితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల కడుపు కొట్టిందన్నారు. ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఓటర్లకు యార్లగడ్డ పిలుపునిచ్చారు.

వైభవంగా శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వనాథస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం



యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 29 : మడిచర్ల, బిళ్లనపల్లిలోని శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వనాథస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. దేవాలయ అభివృద్ధిలో భాగంగా రూ.5లక్షలతో అన్నపూర్ణదేవి, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, చండీశ్వరి, నవగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలతో నిర్వహించిన పూజలో గన్నవరం టీడీపీ-జనసేన అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. తదనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యార్లగడ్డకు స్వామి వారి శేషవస్త్రాన్ని, ప్రసాదాన్ని అందజేసిన అర్చకులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ అభివృద్ధి కోసం రూ.25వేలు ఆలయకమిటీ సభ్యులకు అందజేశారు. 10వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, తెలుగురైతు జిల్లా ఉపాధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు, వడ్డిల్లి లక్ష్మి, తెలుగుయువత నాయకుడు పరుచూరి నరేష్, ఓగిరాల నాని, టీడీపీ మండల కార్యదర్శి పుట్టా సురేష్, దేవినేని సత్యనారాయణ, చెరుకూరి హేమసుందరరావు, కోమర్తి సాయిరాం, సంగ్రామ్ తదితరులు పాల్గొన్నారు.

వాసవ్య మహిళామండలి హాస్టల్‌లో అగ్నిప్రమాదం

పెనమలూరు, ఫిబ్రవరి 29: వాసవ్య మహిళామండలి హాస్టల్‌లో గురువారం పొద్దుపోయిన తర్వాత అగ్నిప్రమాదం జరిగింది. వివరాల ప్రకారం కానూరు వినాయక్‌నగర్‌లోని వాసవ్య మహిళామండలి హాస్టల్‌లో గురువారం రాత్రి మహిళలు తమ గదిలో దోమల చక్రం వెలిగించడంలో అజాగ్రత్తగా వ్యవహరించడంతో అది పరుపు మీద పడి రూంలోని వస్తువులు మంటలకు ఆహుతయ్యాయి. ఆటోనగర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది వెంటనే సమాచారం తెలుసుకొని అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. హాస్టల్లో ఉంటున్న మహిళలకు ఎటువంటి ఇబ్బంది జరగలేదు.



ప్రమాదంలో కాలిపోయిన మహిళల దుస్తులు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పామర్రు, ఫిబ్రవరి 29: పామర్రు-గుడివాడ ప్రధాన రహదారిపై అడ్డాడ వద్ద ఆగి ఉన్న ఆటోను వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొన్న ఘటనలో మహిళ అక్కడిక్కడే మృతిచెందింది. నలుగురికి గాయాలయ్యాయి. గురువారం పామర్రు నుంచి గుడివాడకు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో అడ్డాడ వద్ద ప్రయాణికులను ఎక్కించుకుంటుండగా అదే దిశలో వచ్చిన లారీ వెనుక నుంచి ఢీకొంది. ఆటోలో ఉన్న దేవర కొండ యశోద(58) అక్కడికక్కడే మృతిచెందింది. ఆటోడ్రైవర్‌తో పాటు మరో ముగ్గురికి గాయాల య్యాయి. ఏఎస్సై జి.రాజ్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

జిల్లాలో 1,153 పల్స్‌పోలియో కేంద్రాలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 29: జిల్లాలో 1,153 పల్స్‌పోలియో కేంద్రాలను ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం కోసం ఏర్పాటు చేశామని, ఇందుకోసం 4,898 మంది సిబ్బందిని వినియోగిస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి తెలిపారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వైద్యాధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సీతాకుమారి, జిల్లా అదనపు వైద్యాధికారి వెంకట్రావు పాల్గొన్నారు. డీఈవో కార్యాలయంలో ఎంఈవోలతో నిర్వహించిన సమావేశంలో డీఈవో తాహెరా సుల్తానా మాట్లాడారు. పాఠశాలల నోటీసు బోర్డుల్లో పోస్టర్లు ఉంచి పల్స్‌పోలియోపై రెండు రోజుల పాటు విద్యార్థులకు వివరించాలన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కూచిపూడి, ఫిబ్రవరి 29: ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు, చీఫ్ సూపరింటెండెంట్ మహేష్‌బాబు తెలిపారు. కళాశాలలో తొలిరోజు శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరానికి 175 మంది హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు 9 మంది ఇన్విజిలేటర్లను నియమించారని వెల్లడించారు. కట్టుదిట్టమైన భద్రతల మధ్య, సీసీ కెమెరాల పర్యవేక్షణలో కొనసాగుతాయని వివరించారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ కొనసాగుతుందని, ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షలకు అరగంట ముందుగా అనుమతి ఇస్తున్నట్లు వెల్లడించారు. గురువారం పరీక్ష అధికారులకు సమావేశాన్ని నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. డీవో ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

● మహిళ మృతి..నలుగురికి గాయాలు

పామర్రు, ఫిబ్రవరి 29: పామర్రు-గుడివాడ ప్రధాన రహదారిపై అడ్డాడ వద్ద ఆగి ఉన్న ఆటోను వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొన్న ఘటనలో మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. నలుగురికి గాయాలయ్యాయి. గురువారం పామర్రు నుంచి గుడివాడకు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో అడ్డాడ వద్ద ప్రయాణికులను ఎక్కించుకుంటుండగా అదే దిశలో వచ్చిన లారీ వెనుక నుంచి ఢీకొంది. ఆటోలో ఉన్న దేవరకొండ యశోద(58) అక్కడికక్కడే మృతిచెందింది. ఆటోడ్రైవర్‌తో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఏఎస్సై జి.రాజ్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడిని క్షేమంగా ఇంటికి చేర్చిన పోలీసులు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 29: పార్కులో ఆడుకునేందుకు వెళ్లిన బాలుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ బాలుడిని గుర్తించి క్షేమంగా ఇంటికి తీసుకుని వచ్చారు. చిలకలపూడి సీఐ సతీష్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం.. నిర్మలా హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న చింతా చక్రధర్ శ్రీనివాసనగర్‌కు సమీపంలో నివసిస్తున్నారు. బుధవారం సాయంత్రం పార్కులో ఆడుకునేందుకు వెళ్లి తిరిగి రాలేదు. చల్లపల్లిలోని తన పిన్ని ఇంటికి వెళుతున్న బాలుడిని పోలీసులు గుర్తించి ఇంటికి తీసుకువచ్చారు.

హలో మాల-చలో బాపట్ల విజయవంతం చేయండి

గుడివాడ: మాల మహాసభ పీపుల్స్ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీన బాపట్ల క్రిస్టియన్ గ్రౌండ్స్‌లో నిర్వహించే హలో మాల-చలో బాపట్ల పేరుతో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ఫ్రాన్సిస్ రాజు పిలుపునిచ్చారు. గురువారం మాల మహానాడు కార్యాలయంలో హలో మాల - చలో బాపట్ల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు.



భవన నిర్మాణ కార్మికుల

మచిలీపట్నం,పెడన, అవనిగడ్డలో నిరాహార దీక్ష చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

రెండో రోజూ కొనసాగిన కార్మికుల నిరసన దీక్షలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 29: సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించి తమను ఆదుకోవాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకుడు సీహెచ్ జయరావు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు రెండో రోజు గురువారం ధర్నాచౌక్‌లో రిలే దీక్షలు కొనసాగించారు. బి. సుబ్రహ్మణ్యం, బండారు శ్రీనివాసరావు, వెంకన్న, చిట్టబ్బాయి మాట్లాడారు.

పెడన: ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండవ రోజు గురువారం కూడా భవన నిర్మాణ కార్మికులు పట్టణంలో నిరాహార దీక్ష చేశారు. నిలిపివేసిన సంక్షేమ పథకాలను కొనసాగించాలని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 1214 మెమోను రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఆందోళనకు సీఐటీయూ నాయకులు మర్రావు పోలి నాయుడు, పంచల నరసింహారావు నాయకత్వం వహించారు.

అవనిగడ్డ: సీఐటీయూ పిలుపు మేరకు అవనిగడ్డలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారిపై భవన నిర్మాణ కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు రెండో రోజు గురువారం కొనసాగాయి. దీక్షలను భవన నిర్మాణ, కార్మిక సంఘ నాయకులు అన్నపురెడ్డి నాగేశ్వరరావు, యాసం శ్రీనివాసరావు ప్రారంభించారు. జనసేన పార్టీ నాయకుడు గుడివాక శేషుబాబు దీక్ష శిబిరానికి వచ్చి వారికి సంఘీభావం తెలిపారు. ఆయనతోపాటు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు. రిలే దీక్షల్లో 15 మంది భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



భవన నిర్మాణ కార్మికుల దీక్షకు మద్దతు తెలుపుతున్న వెనిగండ్ల రాము

భవన నిర్మాణ కార్మికుల్ని ఆదుకుంటాం: వెనిగండ్ల రాము

గుడివాడ : టీడీపీ-జనసేన ప్రభుత్వ మొచ్చాక నిర్మాణ రంగ సమస్యలు పరిష్కరిస్తామని, భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్‌తో కలిసి సందర్శించి మద్దతు తెలిపారు. వైసీపీ అధికారంలోకి రాగానే తొలుత భవన నిర్మాణ కార్మికుల పొట్టకొట్టిందన్నారు. కార్మిక సంక్షేమ బోర్డులోని నిధులను దోచుకుందని ఆరోపించారు. మజ్జి శ్రీనివాస్, నాయకులు జేమ్స్, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.



గుడివాడలో రాస్తారోకో చేస్తున్న కార్మిక సంఘాలు

విశాఖ ఉక్కు పరిరక్షణ అందరి బాధ్యత

గుడివాడ: విశాఖ ఉక్కును కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. గురువారం రైల్వేస్టేషన్ రోడ్డులో వివిధ కార్మిక సంఘాలతో కలిసి ఆయన రాస్తారోకో చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయకుండా కార్మిక ఉద్యమాలను నిర్వహిస్తామన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్‌రెడ్డి ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాయని అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటాలకు కార్మికులంతా సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ముఠా కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్‌లను ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ టి.తాతయ్య, ఉప ప్రధాన కార్యదర్శి లింగం ఫిలిప్, సీపీఐ గుడివాడ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్ బాబు, కార్యదర్శి ఓఎల్ రావు, నాయకులు మున్నంగి నరసింహారావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తూము చినకొండయ్య, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి చండోలు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనపై విచారణ

ఘంటసాల, ఫిబ్రవరి 29: పాపవినాశనం మండల పరిషత్ పాఠశాలలో బాలికపై అసభ్యంగా ప్రవర్తించాడని వచ్చిన ఆరోపణలపై ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్‌ను డీఈవో తాహెరా సుల్తానా సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఘటనపై సమగ్ర నివేదిక సమర్పించాలని మండల విద్యాశాఖాధికారులను డీఈవో ఆదేశించడంతో గురువారం ఎంఈవో -1 శివశంకరరావు, ఎంఈవో -2 మోమిన్‌లు పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. బాలిక తల్లిదండ్రులు, గ్రామస్థుల స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు. తాను విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించలేదని ఎంఈవోల ఎదుట ప్రధానోపాధ్యాయుడు వాపోయారు. నివేదికను డీఈవోకు సమర్పిస్తానని ఎంఈవో-1 తెలిపారు.

ఉద్యోగం నుంచి తొలగించండి: తల్లిదండ్రులు

ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బాలిక తల్లిదండ్రులు, గ్రామస్థులు ఎంఈవో శివశంకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఉపాధ్యాయులు కీచకులుగా మారితే పాఠశాలకు పిల్లలను ఎలా పంపించాలని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీనివాస్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు, పవన్‌లను ప్రజలు నమ్మరు: కొడాలి నాని

గుడివాడ: చంద్రబాబు, పవన్‌లను నమ్మి మోసపోయేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరని, రాష్ట్రవ్యాప్తంగా 3శాతం ఓట్లున్న సామాజికవర్గానికి 21 సీట్లను కేటాయించి, మరో 10సీట్లు కేటాయించేందుకు చంద్రబాబు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. 20శాతం ఓటింగ్ ఉందని చెబుతున్న జనసేన పార్టీకి ఎన్ని సీట్లు ఇవ్వాలో చంద్రబాబు చెప్పాలని ఆయన ప్రశ్నించారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. 24సీట్లతో సంతృప్తిగా లేమని జనసైనికులు చెబుతున్నారని అన్నారు.



మొవ్వ, అవనిగడ్డ తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

కూచిపూడి, ఫిబ్రవరి 29: ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు రూ.25 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. గురువారం మొవ్వ తహసీల్దార్ కార్యాలయం ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నేతలు ధర్నా నిర్వహించారు. "అనేక హామీలిచ్చి అధికారంలోకొచ్చిన వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించటంలో జాప్యాన్ని ప్రదర్శిస్తుంది. వైసీపీ ప్రభుత్వం పెట్టిన పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి. జూలై 1, 2023 నుంచి 12వ పీఆర్సీని అమలు చేయాలి." అని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇ.వి.రామారావు డిమాండ్ చేశారు. కె.ఎన్.సోమేశ్వరమ్మ, బి.మాణిక్యాలరావు, జి.భగవాన్, కె.నాగరాజు, పి.దుర్గాప్రసాద్, ఎంఎ అబ్బాస్, వైవీ శ్రీకాంత్‌నాయక్ పాల్గొన్నారు. డిప్యూటీ తహసీల్దార్‌కు మెమోరాండం అందజేశారు.

అవనిగడ్డ: ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మోపిదేవి మండలాలకు చెందిన ఏపీటీఎఫ్ నాయకులు ధర్నా నిర్వహించారు. 8 డిమాండ్లతో వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సాంబశివరావు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మహిళా గళానికి తరలిరండి

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 29: గుడివాడలో మార్చి 4 వ తేదీన నిర్వహించనున్న మహిళా గళం చలో గుడివాడ కార్యక్రమానికి తరలిరావాలని తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు తూము పద్మజ పిలుపునిచ్చారు. గురువారం చినగొన్నూరు, పురిటిపాడు, శేరిదగ్గుమిల్లి, తాడిచర్ల గ్రామాల్లో మండల, నియోజకవర్గ తెలుగు మహిళలు పర్యటించి నాయకురాళ్లను బొట్టుపెట్టి ఆహ్వానించారు. జిల్లాపరిషత్ మాజీ వైస్ చైర్‌పర్సన్, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి శాయిన పుష్పావతిని పద్మజ ఆహ్వానించారు.

కేయూలో ఉచిత వైద్య శిబిరం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 29: ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి జి.జ్ఞానమణి అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో గురువారం ఎన్ఎస్ఎస్, అనుగ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య సేవా శిబిరాన్ని ఎస్సీ కమిషన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ ప్రారంభించారు. సైన్స్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుందరకృష్ణ, డాక్టర్ ఎన్.ఉష, చిలకలపూడి సీఐ కిషోర్, స్వరూప, రవి, శేషారెడ్డి, గోపి, సుజయ్ పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్ కోసం టీడీపీ-జనసేన కూటమికి ఓటేయండి



మగ్గాల కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో పిల్లలతో కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 29: చిన్నారుల భవిష్యత్తు బాగుండాలంటే టీడీపీ-జనసేన కూటమిని ఓటేసి గెలిపించాలని ప్రజలను టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర కోరారు. గురువారం 36వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. మగ్గాల కాలనీ అంగన్వాడీ కేంద్రంలో పిల్లలతో కాసేపు గడిపారు. సీఎం జగన్ రెడ్డి అన్ని వర్గాల వారిని వంచించారని అన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల ఆమోదం కోసం అంగన్వాడీ కార్యకర్తలు 54 రోజులు ఉద్యమిస్తే, కార్యకర్తలను భయపెట్టి డిమాండ్లలో కొన్నింటిని మాత్రమే జగన్‌రెడ్డి నెరవేర్చారని అన్నారు.

రహదారులు వేయలేని అసమర్థ ప్రభుత్వమిది



రొయ్యూరులో కుమార్‌రాజాకు హారతి ఇస్తున్న మహిళలు

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 29: రహదారులను నిర్మించలేని అసమర్థ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ-జనసేన పామర్రు అభ్యర్థి వర్ల కుమార్ రాజా అన్నారు. రొయ్యూరులో గురువారం ఆయన పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరిస్తు సమస్యలను తెలుసుకున్నారు. రొయ్యూరు నుంచి కంకిపాడు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉందని, దీనిపై ప్రయాణించలేకపోతున్నామని ప్రజలు ఆయన దృష్టికి తెచ్చారు. మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. వీరపనేని శివరామ్‌ప్రసాద్, నన్నపనేని వీరేంద్ర, లుక్కా రేణుకారావు, మోర్ల శ్రీనివాసరావు, నూరి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపుదాం: కాగిత



రామవరపుమోడీ గ్రామంలో శంఖారావంలో పాల్గొన్న కాగిత కృష్ణప్రసాద్

బంటుమిల్లి, ఫిబ్రవరి 29: రాష్ట్రంలో దుర్మార్గమైన పరిపాలన చేస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపాలని టీడీపీ-జనసేన పెడన అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం పార్టీ మండల అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో రామవరపుమోడిలో శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. బొర్రా కాశీ, కట్టా శేషగిరిరావు, గూడవల్లి నాంచారయ్య, అంగర రంగనాథ్, అమీర్, నూర్, అక్బర్, కట్టా రమణయ్య, సింగంశెట్టి శ్రీను, నాగేషు పాల్గొన్నారు.

ప్రచారం ముమ్మరం చేయండి

పెడన: శంఖారావం కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నాయకులు, కార్యకర్తలకు టీడీపీ-జనసేన పెడన అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ సూచించారు. గురువారం పట్టణంలో నిర్వహించిన టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల స్థాయిలో టీడీపీ, జనసేన నాయకులతో కమిటీ వేసి, ప్రచార కార్యక్రమాలు అప్పగించాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయం దగ్గరపడినందున పార్టీ కార్యక్రమాలను ముమ్మరం చేయాలని సూచించారు. బొడ్డు వేణుగోపాలరావు, పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల నాయకులు పాల్గొన్నారు.

జగన్‌కు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా రైతులు

● తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 29: ఉత్తుత్తి బటన్లు నొక్కి రైతులను సీఎం జగన్‌రెడ్డి మోసం చేస్తున్నారని, ఆయనకు బుద్ధి చెప్పేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. గురువారం బందరు మండలం కానూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఇన్సూరెన్సు కట్టవద్దని ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందని చెప్పి రూపాయి ఇన్సూరెన్సు కూడా కట్టలేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందలేదని, బ్యాంకు మేనేజర్లు బకాయిలు చెల్లించాలని నోటీసులు ఇస్తున్నారని అన్నారు. సున్నా వడ్డీ రుణాలు ఇస్తే రైతులు ఆరువేలు వడ్డీ ఎందుకు చెల్లించాలని నిలదీశారు.

తాడేపల్లిగూడెం సభ విజయవంతంతో వైసీపీ నేతల్లో వణుకు: మాదివాడ రాము

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 29: తాడేపల్లిగూడెంలో నిర్వహించిన జనసేన-టీడీపీ తెలుగుజన విజయ కేతనం జెండా సభ విజయవంతమవడంతో వైసీపీ నేతల్లో వణుకు మొదలైందని జనసేన నాయకుడు మాదివాడ రాము అన్నారు. గురువారం తన ఇంటి వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. మచిలీపట్నం చుట్టుపక్కల నుంచి వందలాది వాహనాలతో జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారన్నారు. రానున్న ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి ఉమ్మడి పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు.

వారంలోగా విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

● విద్యుత్ ఏఈకి ఎంపీపీ గద్దె పుష్పరాణి ఆదేశం

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 29: మండలంలోని ప్రతీ గ్రామంలో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటిని వారం రోజుల్లోగా పరిష్కరించాలని విద్యుత్ ఏఈ సురేశ్‌బాబును ఎంపీపీ గద్దె పుష్పరాణి ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు వేయాలని, రెండేళ్ల నుంచి చెబుతున్నా పట్టించుకోవడం లేదని ఎంపీపీతో పాటు, మండలంలోని సర్పంచ్‌లు, చిరుచింతల ఎంపీటీసీ సభ్యుడు సుబ్బారావు తదితరులు విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. చిరుచింతల, నూజెళ్ల, దొండపాడు, మోటూరు, చౌటపల్లి గ్రామాల్లో స్తంభాలు వేయడం లేదని, జగనన్న కాలనీల్లో నూతన స్తంభాలు వేయకుండా తాత్సారం చేస్తున్నారని, కొన్నిచోట్ల వేసిన పాత స్తంభాలు వదిలేస్తున్నారని ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్తంభాలను రోడ్లపై ఈడుస్తున్నారని, దీంతో రోడ్లు పాడైపోతున్నాయని, అలా చేస్తే విద్యుత్ అధికారులపై కేసు నమోదు చేస్తామని పంచాయతీ ఏఈ వి.సూరిబాబు హెచ్చరించారు. ఎంపీడీవో జ్యోతి, గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ మట్టా నాగలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



నిరుపయోగంగా ఉన్న దళితుల భూములు

దళితుల భూములు లాక్కొని.. నిరుపయోగంగా వదిలేశారు

● సీఎం గారూ..బంగాళతోట భూములు తిరిగి ఇచ్చి న్యాయం చేయండి: దళితుల ప్రతినిధి సంగీతరావు

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 29: 45 ఏళ్ల నుంచి తోట్లవల్లూరు బంగాళతోటలో 9.47 ఎకరాల భూమిని 23 దళిత కుటుంబాలు సాగుచేసుకుని జీవిస్తున్నాయి. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బోర్లు నిర్మించుకున్నారు. పంటలు పండిస్తూ జీవిస్తుండగా 2020లో జగనన్న ఇళ్ల స్థలాల కోసమని కందిపంటను ఎక్సకవేటర్, ట్రాక్టర్లతో దున్నేసి బలవంతంగా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సెంటున్నర చొప్పున ప్లాట్లు చేసి రోడ్లు పోసేశారు. దళితులు హైకోర్టుకు వెళ్లి స్టే ఆర్డరు తెచ్చుకున్నారు. ఒక్కొక్కరికి రూ.5 లక్షలు, రెండు ప్లాట్లు ఇస్తామని, కోర్టులో కేసు ఎత్తేయాలని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ దళితులతో రాజీ చేశారు. అందుకు దళితులు అంగీకరించినా ఇంతవరకు న్యాయం చేయలేదు. మరోవైపు కోరు స్టే ఆర్డరుతో ఇంతరవకు స్థలాల పంపిణీ జరగకపోవటంతో మళ్లీ 10 ఎకరాల ప్రైవేటు భూములను కొనుగోలు చేపట్టి దళితుల భూములను నిరుపయోగంగా వదిలేశారు. దళితులు సాగుచేసుకోకుండా రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నారు. దీనిపై సీఎం జగన్ స్పందించి భూములను తిరిగి తమకు ఇప్పగించాలని దళితుల ప్రతినిధి మొవ్వా సంగీతరావు కోరారు.

పోతురాజుస్వామి గుడి మాదే

● పెడనలో ఇరువర్గాల మధ్య వివాదం



ఇరువర్గాల పెద్దలకు నచ్చచెబుతున్న ఎస్ఐ సూర్యశ్రీనివాస్

పెడన, ఫిబ్రవరి 29: మెయిన్‌రోడ్డులోని పోతురాజుస్వామి గుడి వద్ద గురువారం ఉదయం ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల జోక్యంతో ఉద్రిక్తత సద్దుమణిగింది. పోతురాజుస్వామి గుడి పునర్నిర్మాణం నిమిత్తం ఒక వర్గం గురువారం ఉదయం శంకుస్థాపన కార్యక్రమం తలపెట్టింది. మరో వర్గం దీనిని అడ్డుకుంది. ఈ రెండు వర్గాలు గుడి మాదంటే మాదంటూ వాగ్వివాదానికి దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎస్ఐ సూర్యశ్రీనివాస్ సిబ్బందితో వెళ్లి ఇరువర్గాలకు నచ్చజెప్పారు. శంకుస్థాపనను నిలిపేశారు. ఆధారాలతో గుడి ఎవరిదో తేల్చుకుని మునిసిపాలిటీ అనుమతితోనే నిర్మాణం ప్రారంభించాలని ఇరువర్గాల పెద్దలకు ఎస్ఐ సూచించారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో డాక్టర్ కేకేఆర్స్ విజయభేరి

గుడివాడ: నవర్స్ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన నేషనల్ అస్ట్రానమీ అండ్ సైన్స్ ఒలింపియాడ్(నాసో)లో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులు 46మంది బంగారు పతకాలను సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సత్యారామ్ తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. సైన్స్ ఒలింపియాడ్‌లో 3వ తరగతికి చెందిన 8మంది, 4వ తరగతికి చెందిన 8మంది, 5వ తరగతికి చెందిన 8మంది, 6వ తరగతికి చెందిన 8మంది, 7వ తరగతికి చెందిన 8మంది, 8వ తరగతికి చెందిన ఆరుగురు బంగారు పతకాలు సాధించారని తెలిపారు. ఈ నెల 4, 5, 6 తేదీల్లో నిర్వహించే రెండో లెవల్ ఆన్‌లైన్ పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు. విద్యార్థులు, శిక్షణనిచ్చిన ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్స్ లక్ష్మీప్రసాద్, జ్యోతి, జబ్రీనా అభినందించారు.

కేంద్ర పథకాలు వైసీపీవిగా సీఎం ప్రచారం

● బీజేపీ మచిలీపట్నం ఇన్‌చార్జి సోడిశెట్టి బాలాజీ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 29: "కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను తన పథకాలుగా సీఎం జగన్‌రెడ్డి పత్రికా ప్రకటనలు ఇచ్చి ప్రచారం చేసుకుంటున్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారిని నట్టేట ముంచారు." అని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సోడిశెట్టి బాలాజీ విమర్శించారు. గురువారం బీజేపీ ప్రజాపోరు యాత్ర కార్యక్రమాన్ని దేవునితోట ఎస్టీ కాలనీలో ఆయన ప్రారంభించారు. పార్టీ జిల్లా నాయకుడు గుత్తికొండ రాజాబాబు, నాయకులు ఎన్.రాము, దూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, మత్తి వెంకటేశ్వరరావు, ఎస్.నాగాయత్రి, వన్నెంరెడ్డి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

3న పిల్లలకు పోలియో చుక్కలు వేయించండి

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 29: మండలంలో మార్చి 3వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీపీ గద్దె పుష్పరాణి తెలిపారు. పిల్లలందరికీ తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలని ఆమె సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమ వాల్ పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఎంపీడీవో ఎ.వెంకటరమణ, గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ మట్టా నాగమణి, డాక్టర్ దీప్తి, డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.